క్లుప్తంగా

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: సంగడిగుంటలోని బాపూజీ విద్యాసంస్థల్లో చదువుతున్న పేద విద్యార్థులకు గురువారం శ్రీ బాలల సేవా సమితి ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాపూజీ విద్యాసంస్థల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ మాట్లాడుతూ పేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ, వస్త్రదానం చేయడం అభినందనీయమన్నారు. చదువుకోవాలనే ఆసక్తి, కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో చదువును కొనసాగించలేకపోతున్నవారిని శ్రీ బాలల సేవ సమితి ప్రయోజనకరమైన కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. తమకున్న కొద్దిపాటి ఆదాయంలోనే ఇటువంటి మంచి కార్యక్రమాలు చేయడం ద్వారా ఎంతోమందికి మార్గదర్శకంగా నిలుస్తున్నారన్నారు. బాలల సేవా సమితి వ్యవస్థాపక చైర్మన్ కర్పూరపు గోవర్ధిని మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో చదువును కొనసాగించలేకపోతున విద్యార్థులకు ప్రతి నెలా ఉపకార వేతనాలు అందిస్తున్నామని తెలిపారు. సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి రేమాండ్స్ సంస్థ అధినేత త్రిపురమల్లు అరుణ్‌కుమార్, పద్మావతి సహాయ, సహకారాలను అందించారని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, రమాదేవి, సుభద్ర, వాణి వెంకట్, రాధిక, కమల, నిర్మల, విజయలక్ష్మి, సత్యవతి పాల్గొన్నారు.

'టారిఫ్‌ల పెంపు'పై నిరసనల్లో పాల్గొనండి

లక్ష్మీపురం: అమెరికా టారిఫ్‌ల పెంపునకు వ్యతిరేకంగా నిరసనలకు వామపక్షాలు పిలుపునిచ్చాయని, శుక్రవారం జరిగే కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్.బాబురావు పిలుపునిచ్చారు. గుంటూరు బ్రాడీపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు అధ్యక్షతన గురువారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50శాతం విధించారన్నారు. ఈ నేపథ్యంలో మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ఆక్వా, టెక్స్‌టైల్, గార్మెంట్స్ వంటి ఉత్పత్తుల ధరలు అమెరికాలో ఘోరంగా పెరిగాయని, ఏటా సుమారు రూ.2వేల కోట్ల డాలర్ల విలువైన ఆక్వా ఉత్పత్తులు మన రాష్ట్రం నుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్నాయన్నారు. రొయ్యలు, చేపల రైతులు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నారన్నారు. గుంటూరు జిల్లాలో స్పిన్నింగ్ మిల్లులపై ప్రభావం పడుతుందని, వీటిల్లో ఎక్కువగా మహిళా శ్రామికులు పనిచేస్తున్నారని తెలిపారు.

ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌కు నిరసన సెగ



పట్నంబజారు: గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్‌కు నిరసన సెగ తగిలింది. ఎమ్మెల్యే తీరుపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏటుకూరు రోడ్డులో గురువారం సూపర్ సిక్స్.. స్త్రీ శక్తి సక్సెస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సభలో, బయట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ప్రధాని నరేంద్రమోదీ ఫొటో ఏర్పాటు చేయకపోవడంతో బీజేపీ నేతలు, క్యాడర్ మొత్తం బయటకు వచ్చి పెద్దఎత్తున నసీర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రతిసారి ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్ బీజేపీని అగౌరవపరుస్తూనే ఉన్నారని, నియంతలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, పలువురు టీడీపీ నేతలు సర్దిచెప్పే యత్నం చేసినప్పటికీ.. ససేమిరా అంటూ అక్కడ నుంచి వెళ్లిపోయారు. కార్యక్రమం సాయంత్రం 4.30 గంటలకు అని ప్రకటించారు. సాయంత్రం ఆరు గంటలు అయినప్పటికీ.. ఎమ్మెల్యే సభా ప్రాంగణానికి రాకపోవటంతో మహిళలు, కూటమి కార్యకర్తలకు చిర్రెత్తుకువచ్చి బయటకు వచ్చే ప్రయత్నం చేశారు. ఆఖరికి చిరాకుతెత్తుకొచ్చి 'మీకు చేతనైంది చేసుకోండి' అంటూ అక్కడ నుంచి మహిళలు వెళ్లిపోయారు.

21న జాషువా పద్య పఠన పోటీలు

లక్ష్మీపురం: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 130వ జయంతి సందర్భంగా ఈ నెల 21 ఆదివారం జాషువా పద్య పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ ఎస్.భావన్నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ పోటీలు సీనియర్స్, జూనియర్స్ (విద్యార్థులు) విభాగాలలో జరుగుతాయని ఆయన తెలిపారు. పోటీల ముగింపులో బహుమతి ప్రదానం జరుగుతుందని తెలిపారు. 21వ తేదీ ఉదయం 10 గంటలకు నుంచి 2/7 బ్రాడీపేట జాషువా విజ్ఞాన కేంద్రంలో పోటీలు ప్రారంభమవుతాయని తెలియజేశారు. పోటీలు పీ.వీ.రమణ, జి.లూథర్ పాల్ ఆధ్వర్యంలో జరుగుతాయని ఆసక్తిగల వారు వారిని సంప్రదించాలని కోరారు. ఇతర వివరాలకు 86392 16049, 75691 16080 నెంబర్లలో సంప్రదించాల్సిందిగా తెలిపారు.

తాగునీటి చెరువులోకి చేరిన మురుగునీరు

- పెదకాకానిలో భయాందోళనలు చెందుతున్న ప్రజలు
- చెరువును శుభ్రం చేయించడంలో అధికారుల నిర్లక్ష్యం
- ఇకనైనా తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక వైఎస్సార్‌సీపీ నేతల వినతి



పెదకాకాని పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెదకాకాని: తాగునీటి అవసరాలకు నీరు నిల్వ చేసే చెరువులో చేరిన మురుగునీటిని బయటకు పంపాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముడియాల మల్లికార్జునరెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ... పెదకాకాని గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మంచినీటి చెరువులోకి గ్రామంలోని మురుగునీరు వచ్చి చేరిందన్నారు. మధ్యలో కట్ట తెగి చెరువు నీరు కలుషితం అయిందని చెప్పారు. రెండేళ్లుగా చెరువును ఎండబెట్టి బ్లీచింగ్, సున్నం కొట్టలేదన్నారు. ఈ నీరు తాగి ప్రజలు ముున్ముందు తీవ్ర అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. మూడు నెలలుగా గ్రామంలో రంగు మారిన, దుర్వాసనతో కూడిన నీరు సరఫరా అవుతోందని తెలిపారు. ఇప్పటికే గ్రామ ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. చిన్న పిల్లలకు చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. 20 రోజులు దాటినా చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టలేదని పేర్కొన్నారు. ఇప్పటికే రెండుసార్లు గండి పడిన చెరువు కట్టకు శాశ్వత పరిష్కారం దిశగా తగిన మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. ఇకనైనా అధికారులు స్పందించాలని కోరారు.

గుంటూరు చానల్ నీటితో నింపాలి

చెరువులోకి చేరిన మురుగునీటిని బయటకు పంపేందుకు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. చెరువులో సున్నం, బ్లీచింగ్ పౌడరు కొట్టి ఎండబెట్టాలన్నారు. అనంతరం చెరువుకు గుంటూరు చానల్ నుంచి నీరు తీసుకొచ్చి రక్షిత మంచినీటి పథకం ద్వారా గ్రామంలో అందించాలని సూచించారు. పరిశుభ్రమైన తాగునీరు ప్రజలకు సరఫరా చేయాలని అధికారులను కోరారు. ముందుగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఇదే విషయమై పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర కృష్ణారెడ్డి, వీర్ల వీరాంజనేయులు, ఎస్‌కే నజీర్, ఆర్వల బ్రహ్మం, మురికిపూడి చంద్రశేఖర్, రెడ్డి నాగేశ్వరరావు, పెండెం విజయ్ బాబు, యడ్లపల్లి రమేష్, పాగోలు శ్రీనివాసరావు, నడింపల్లి అంకమ్మరావు, బత్తుల వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



విశ్రాంత ఉపాధ్యాయుడు సి.అప్పలస్వామి, ప్రొఫెసర్ వి.గోవర్ధనరావులను సత్కరిస్తున్న దృశ్యం

పెదకాకాని: వివా, వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కోరుకొండ సైనిక్ స్కూల్ విశ్రాంత ఉపాధ్యాయుడు సి. అప్పలస్వామి, ఐఐటీ ముంబయి విశ్రాంత అధ్యాపకుడు ప్రొఫెసర్ వి.గోవర్ధనరావు, వీవీఐటీ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కొడాలి రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.అప్పలస్వామి మాట్లాడుతూ టీచర్లు చెప్పే విషయాన్ని విద్యార్థులు అర్థం చేసుకుని మెదడులో భద్రపరుచుకోవాలని సూచించారు. నేడు సక్రమమార్గంలో నడవటం వలన రేపు విజయం వరిస్తుందన్నారు. అన్ని అంశాలలో అవగాహన కలిగి ఉండటం వలన విద్యార్థులకు ఆత్మస్థైర్యం పెరుగుతుందని అన్నారు. ప్రొఫెసర్ వి.గోవర్ధనరావు మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప టీచర్, ఫిలాసఫర్ అని కొనియాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు రోల్ మోడల్‌గా ఉండాలని, విద్యార్థులు వారి లక్ష్యాన్ని సాధించేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సి అప్పలస్వామిని, ప్రొఫెసర్ వి.గోవర్ధనరావులను చాన్సలర్, వైస్ చాన్సలర్‌లు, కోరుకొండ సైనిక్ స్కూలు పూర్వ విద్యార్థులు సత్కరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, గీతాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వివా, వీవీఐటీ విద్యార్థులు అధ్యాపకులకు పుష్పగుచ్ఛాలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. వారి ఆశీస్సులు పొందారు. ఉపాధ్యాయులకు క్రీడా, సాంస్కృతిక అంశాలలో పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ కార్యక్రమంలో కోరుకొండ సైనిక్ స్కూల్ పూర్వ విద్యార్థుల విభాగ సభ్యులు, వీవీఐటీ రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, వివా ప్రిన్సిపాల్ సీహెచ్ సరళ, వివా డైరెక్టర్ ఎలికమాండర్ కె.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.


దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులు



సర్వేపల్లి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అతిథులు, కళాశాల నిర్వాహకులు

గుంటూరు రూరల్: ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులని, నవ సమాజ నిర్మాణానికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అందించిన సేవలు చిరస్మరణీయమని గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల అధ్యాపకుడు డాక్టర్ గంటా శ్రీనివాసులు తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. దేశ నిర్మాణానికి అవసరమైన మేధావులను, శాస్త్రవేత్తలను, ఇతర రంగాల్లో నిపుణులను తయారు చేసే శిల్పులు ఉపాధ్యాయులని తెలిపారు. మారుతున్న విద్యావ్యవస్థకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులకు బంగారు భవిష్యత్తును అందించి, సమాజంలో ఉత్తమ పౌరులుగా నిలబెట్టే శక్తి ఉపాధ్యాయులకే ఉందని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. విద్యార్థులను జ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతూ, దేశ పురోగతికి పాటు పడుతున్న గురువుల కృషి వెలకట్టలేనిదని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎం. విజయ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

గుంటూరు రూరల్: కారణజన్ములు తల్లిదండ్రులు అయితే, సమాజంలో విజ్ఞానవంతులుగా విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులు మాత్రమేనని మాజీ వ్యాయామ అధ్యాపకుడు మున్నంగి సంజీవరెడ్డి తెలిపారు. గురువారం అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పూజింపబడతారో ఆ భూమి పుణ్యభూమి అన్నారు. ఈ కాలంలో విద్యార్థుల ప్రవర్తన ఎలా ఉందో అందరికీ తెలిసిన విషయమేనని తెలిపారు. తల్లిదండ్రులు గానీ, ఉపాధ్యాయులు గానీ అదుపులో ఉంచలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. గురువులను గౌరవించినప్పుడే విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకుని ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. ఉపాధ్యాయులు లేని సమాజాన్ని ఊహించలేమని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చావలి సరోజిని మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య అవినాభావ ఆత్మీయ అనుబంధం ఉండాలన్నారు. కాలానుగుణంగా విద్యార్థులతో ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ప్రతి విద్యార్థి కృషి చేస్తే భావితరాలు బాగుంటాయని రిటైర్డ్ బ్యాంక్ ఏజీఎం బొందలపాటి నర్సిరెడ్డి తెలిపారు. చంద్ర నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నర్మద మాట్లాడుతూ దేశాభివృద్ధి వెనుక ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉంటుందన్నారు. కళాశాల ఇన్‌చార్జి రామచంద్రరావు మాట్లాడుతూ... గురుశిష్యులు స్నేహితుల్లా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులను కమిటీ సభ్యులు కుర్రా సాంబిరెడ్డి, దేవగిరి వీరగంగాధరరెడ్డి, కుర్రా పుల్లారెడ్డి, వజ్రాల వెంకటేశ్వరరెడ్డి, ఏసుబాబు, సింహాద్రి శివారెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురువు ఆశీర్వాదంతోనే సన్మార్గం



రాధాకృష్ణన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పెదకాకాని (ఏఎన్‌యూ): గురువు ఆశీర్వాదంతోనే జీవితానికి సన్మార్గం దొరుకుతుందని, విజయవంతమైన జీవితానికి కీలకమైన పునాది అవసరమని, ఆయనే గురువు అని ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (నూటా) ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాలు డైక్ మెన్ ఆడిటోరియంలో జరిగాయి. ఫ్యాకల్టీ క్లబ్‌లోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి వర్సిటీ అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వర్సిటీ డైక్‌మెన్ ఆడిటోరియంలో జరిగిన సభలో వీసీ మాట్లాడుతూ జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఉత్తమమైన వ్యక్తిని తయారు చేయడమే విద్య పరమార్థం అని తెలిపారు. సాంకేతికతను అందిపుచ్చుకునే తరానికి చెందిన విద్యార్థులను ఆకర్షించేలా ఉపాధ్యాయ బోధన ఉండాలన్నారు. నిరంతర సాధనతో విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. తరగతి గదిలో, సమాజంలో ఉపాధ్యాయులను అందరూ పరిశీలిస్తారని, ఆ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యవహరించాలని కోరారు. వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ రత్నషీలామణి మాట్లాడుతూ ఆధునిక కాలంలో గురువు అనే మాటకు నిలువెత్తు నిదర్శనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ నిలుస్తారన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి సింహాచలం మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శంగా ఉండాలని కోరారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్ కుమార్, ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవి కుమార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.వీరయ్య, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య లింగరాజు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ప్రమీలారాణి, దూరవిద్య కేంద్రం సంచాలకులు ఆచార్య వి.వెంకటేశ్వర్లు, సీడీసీడీఎస్ ఆచార్య వి.రవికుమార్, నూటా జాయింట్ సెక్రెటరీ ఆచార్య ఎం సుబ్బారావు, కాంట్రాక్ట్, గెస్ట్ ఫ్యాకల్టీలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ

పెదకాకాని: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గురువారం స్థానిక సచివాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ అన్ని రకాల నిత్యావసర సరుకులు పెరిగాయని చెప్పారు. వాటికి అనుగుణంగా గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. సబ్బులు, నూనె, యూనిఫామ్, గుర్తింపు కార్డులు, గ్లౌజులు ఇవ్వాలన్నారు. వారంతపు సెలవులు, క్యాజువల్ లీవులు ఇవ్వాలని తెలిపారు. టెండర్ విధానం రద్దు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. అలానే మార్చిలో టెండర్ ప్రతిపాదనలు పంపి ఆర్డర్ కాపీ ఇప్పించాల్సిన అధికారులు ఇంతవరకు ఆర్డర్ కాపీ తెప్పించకపోవడం వల్ల పెరిగిన జీతాలు కోల్పోవాల్సి వస్తోందన్నారు. డిసెంబరు 31వ తేదీ నుంచి ఐదు రోజులపాటు విశాఖపట్నంలో జరిగే సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.ఆదిలక్ష్మి, ఎన్.రాయలమ్మ, ఎస్. జైపాల్, పి.లింగమ్మ, ఎన్.కుమారి, వి.రోశమ్మ, పి. మార్తమ్మ, వి.ఆవాజ్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో ప్రభుత్వ విద్యాలయాలు ఏర్పాటు చేయాలి

రాజధాని ప్రాంత అభివృద్ధి వేదిక డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వేదిక కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రాజధాని అమరావతిలో ప్రభుత్వ విశ్వ విద్యాలయాలు, కళాశాలలు ఏర్పాటు చేయాలని రాజధాని ప్రాంత అభివృద్ధి వేదిక కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. గుంటూరు బ్రాడీపేటలో గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. కార్యాక్రమంలో లక్ష్మణరావు మాట్లాడుతూ వీఐటీ, ఎస్ఆర్ఎం ప్రైవేటు యూనివర్సిటీలకు గతంలో 200 ఎకరాల చొప్పున భూములు ఇచ్చారని, ఇప్పుడు మరో 100 ఎకరాలు చొప్పున ఇవ్వాలని నిర్ణయించారన్నారు. కానీ ఆ రెండు యూనివర్సిటీలు రాజధాని ప్రాంత విద్యార్థులకు సీట్ల కేటాయింపు గానీ, ఫీజులలో ఎటువంటి రాయితీలు గానీ ఇవ్వడం లేదన్నారు. ఈ ప్రాంతంలో అమరావతి విశ్వవిద్యాలయం పేరుతో సామాజిక శాస్త్రాలకు హ్యూమానిటీస్‌కు ఒక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ డీఏఆర్ సుబ్రమాణ్యం మాట్లాడుతూ తుళ్లూరు ప్రాంతంలో అధునాతన కోర్సులతో డిగ్రీ కళాశాల, ఒకేషనల్ కోర్సులతో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. రాజ్యాంగ చర్చా వేదిక నాయకులు అవధానుల హరి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీని ప్రైవేట్ రంగంలో కాకుండా ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యావేత్త ఆర్.రాము, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి సమీర్, ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వరరావులు మాట్లాడారు. రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు సంఘ నాయకులు కె.అజయ్‌కుమార్, రాజధాని ప్రాంత నాయకులు ఎం.రవి, భాగ్యరాజు, నవీన్ ప్రకాష్, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్టి, మహిళా సంఘ నాయకులు అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివ రామిరెడ్డి, భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కొలనుకొండ స్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు గురువారం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 30 ఉంటుందని, రైల్లో నుండి జారిపడి మృతి చెందినట్టు భావిస్తున్నామని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 7207076614 నంబరులో సంప్రదించాలన్నారు.

అటు బోధన.. ఇటు సేవా పథాన..

- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా లక్ష్మీ కుమారి ఎంపిక
- బడులలో పలు అభివృద్ధి పనులు చేపట్టిన ఔదార్యం
- రూ. లక్షల సొంత నిధులతో సౌకర్యాల కల్పన



వేజండ్ల (చేబ్రోలు): చేబ్రోలు మండలం వేజండ్ల ఎంపీపీ (బీఎఫ్ఎస్) స్కూల్ టీచర్ ఎంవీఎస్ లక్ష్మీ కుమారి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారి రాయల సుబ్బారావు గురువారం తెలిపారు. వేజండ్ల గ్రామానికి చెందిన లక్ష్మీ కుమారి 30 సంవత్సరాలుగా జిల్లాలోని చెరువులోపాలెం, ఉప్పరపాలెం, బేతపూడి, వేజండ్ల గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారు. ఆమె పనిచేసిన బేతపూడి పాఠశాలలో రూ.లక్షల సొంత ఖర్చుతో పాఠశాల అభివృద్ధికి కృషి చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న వేజండ్ల బీఎఫ్ఎస్ పాఠశాల అభివృద్ధికి కూడా సొంత ఖర్చుతో వివిధ పనులు చేసి ఆదర్శంగా నిలిచారు. దీర్ఘకాలంగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాల చేపట్టి అందరి మన్ననలు పొందారు. కంప్యూటర్, ప్రింటర్, మూడు కంప్యూటర్ టేబుళ్లు, బల్లలు, మధ్యాహ్న భోజనశాలకు అవసరమైన వంట సామగ్రి, బీరువా తదితర వస్తువులను ఇప్పటికే ఆమె విరాళంగా పాఠశాలకు అందజేశారు. పాఠశాల ప్రాంగణాన్ని ఆహ్లాదకరంగా పూలు, పండ్లు, కూరగాయల మొక్కలతో తీర్చిదిద్దేలా విద్యార్థులను ప్రోత్సహించారు. వీటిని విద్యార్థులకు ఆహారంగా ఉపయోగపడేలా చేస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తితోపాటు సామాజిక సేవా కార్యక్రమాలతో మన్ననలు పొంది జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకోనున్న లక్ష్మీ కుమారిని ఎంపీపీ కె.సాహితి, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామ పెద్దలు అభినందించారు.

వైభవంగా గణేష్ నిమజ్జనం

కొల్లిపర: వినాయ చవితి పండుగను పురస్కరించుకొని మండల బ్రాహ్మణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రం కొల్లిపర గ్రామంలోని బ్రాహ్మణ భవన్ లో ఏర్పాటు చేసిన మట్టి బొజ్జ గణపయ్య 9 రోజులు వైభవంగా పూజలు అందుకుని గురువారం భక్తుల సమక్షంలో గ్రామోత్సవం నిర్వహించి కృష్ణా నదిలో నిమజ్జనం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన లడ్డు పాటలో రాజస్థాన్ నుంచి వచ్చి టీ స్టాల్ నిర్వహిస్తున్న రవి 25 వేల రూపాయిలకు పాడి లడ్డును సొంతం చేసుకున్నాడు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ ఐక్యవేదిక నాయకులు పోగుల రామలింగేశ్వర శర్మ, జగన్నాథ ఆచార్యులు, సూర్యనారాయణ శాస్త్రి, ఉదయభాస్కర్, రమణశర్మ, రాంబాబు, నిరంజన్ కుమార్, వీరభద్రరావు, శివరామ్మాస్టరు, సుధాకర్, తెనాలి బ్రాహ్మణ సంఘ నాయకులు పురుషోత్తమ శర్మ, వెంకట సుబ్రహ్మణ్య , రత్నాకర్ , భక్తులు పాల్గొన్నారు.